అనుభూతి

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

తీరా యింటికి వెళ్ళేటప్పటికి తలుపు తాళం వేసి వుంది. అంతవరకు రవి వూళ్ళోనే వున్నాడనే మధు అనుకోవటం.

క్రిందటిసారి కనిపించినప్పుడు మాత్రం సూచనగా అన్నమాటవుతే నిజమే కాని, అప్పటికప్పుడే వెళ్ళిపోతాడని మాత్రం మధు అనుకోలేదు. అన్నంత పనీ చేసితీరాడు. గట్టిపిండం. రవి అన్నమాటలకు పూర్తి అర్థం యిప్పటికి మధుకు తెలిసినట్లయింది. ఆలోచిస్తూవుండగానే మధు కళ్లు చెమ్మగిలినాయి.

రవి యింట్లోంచి లేచిపోవలసిన అవసరం యేంకలిగింది? నిజంగా ఆ భార్యాభర్తలమధ్య చిన్న చిన్న పొరపులకు కారణాలు యేమన్నా వున్నాయా? అయినా వాటికోసమా తాను యిల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఎంతఘోరమైన బాధ అనుభవిస్తున్నాడని. అతనిభార్య అలాంటిది కాదే! అలాంటి ఉత్తమురాలికి భర్తఅయ్యే భాగ్యం రవికే కలగాలి అని తాను యెన్నిసార్లు అసూయపడ్డాడో రవికేం తెలుసు? శని పట్టుకుపీడిస్తుంటే రవిమాత్రం యేంచెయ్య కలుగుతాడు! ఇంట్లోంచి లేచిపోయాడు. ఊళ్ళపాలయిపోయినాడు ఏంసుఖం అనుభవించనో. ఇంట్లో లేని సుఖం వీధుల్లో యేముంటుంది? వూళ్ళల్లో యేముంటుంది? నిజంగా యెప్పటికీ వదిలేసి వెళ్ళిపోవటానికేనా భార్యను పుట్టింటికి పంపించింది. పాపం పూర్తిగా అమాయకురాలు. రవి దుర్బుద్ధి ఆమెకు చెప్పేయాల్సింది. ద్రోహం చేశాను. తెలిసికూడా కప్పిపుచ్చాను. మధు బాధపడుతున్నాడు.

స్టేషన్లో సుజాతకళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగినప్పుడు మధు చలించిపోయాడు. ఆమె కళ్ళల్లో జాలి, ప్రేమ, అందము అన్నీ మధును విపరీతంగా ఆకర్షించినాయి. రైలు కదలబోతోంది. సుజాత మొహం చూడలేకపోయాడు. మధుహృదయం యెందుకో వెక్కి వెక్కి యేడ్చింది. కాని రవి అట్లాగే నిలబడిపోయాడు. మగవాడు, తనభర్త రైలుస్టేషన్లో అంతకంటె యేవిధంగానూ తన మనోవేదన వెళ్ళబుచ్చలేడని సుజాత తృప్తిపడింది. తప్పక రండి అన్న సుజాత మాటలుకూడా రవి నిబ్బరంగానే స్వీకరించాడు. సుజాతకు రవి అంగీకారం అర్థమయినట్లనిపించింది. మధు నమ్మలేదు పూర్తిగా. రవి సుజాతను నమ్మించాడు. సుజాతకు అసలు విషయం తెలుస్తే యేంచేసేదో? ఇంకా వస్తాడు ఇంకా వస్తాడు అని అనుకుంటూ సుజాత తన పుట్టింట్లో రవికోసం యెన్నాళ్లు యెదురుచూస్తూ కూర్చుంటుంది. దుర్మార్గుడు. కఠినహృదయం. రాతిమనసు. ఆడదాని మనసు అర్థం చేసుకోలేకపోయాడు. అందులో యేరికోరి చేసుకున్న పెళ్లి. ప్రేమించిన యువతి— పెద్దఘనకార్యం. ఒక పెద్ద ఆశయానికి చాలాదగ్గరగా వెళ్లాడు రవి. తనకూ అలాంటి వివాహం అవుతే బాగుంటుందని వుంది. అయితే మధు అనుకుంటున్న గృహస్థజీవితానికి యీ ఆశయం నెరవేరటానికి యేవిధమైన సంబంధం మధు పెట్టుకోలేదు.

గిర్రున తిరిగి యింటికి వెళ్లిపోయాడు మధు. కుర్చీలో కూర్చున్నాడు. ఏ పుస్తకం తీసినా, ఏ ఆలోచనలోకి పోయినా రవి యిల్లే మాటిమాటికీ జ్ఞాపకం వస్తోంది మధుకు. ఆ యింటికి వెళ్లినప్పుడల్లా యేదో కీచులాట వినిపిస్తూనేవుండేది. దానికి కారణం యెంత వూహించినా మధు తెలుసుకున్నట్లు కనిపించలేదు. చిన్న చిన్న మాటలు కూడా తాను వినకూడదని సుజాత యెంత ప్రయత్నం చేస్తూవుండేదో, మధుకు తెలుస్తున్నప్పుడల్లా, ఆమెమీద, తన హృదయంలో మారుమూలనుంచి తనకు తెలియకుండానే జాలి, ప్రేమ వచ్చిపడేవి. తాను స్వయంగా ఆమెతో మాట్లాడదామనుకున్నాడు. రవికి యే అభ్యంతరం వుండదని మధుకు తెలుసు. కాని ఏమని మొదలుపెడ

తాడు? ఏ విషయాన్ని గురించి మాట్లాడుతాడు? అంతా అయోమయంగా వుండేది మధుకు. రవి బడబడ యేవేవో అనేశేవాడు. రవికి మధు చనువు, మధు వింటాడనే అభిప్రాయం రవికి యేకోశానా లేదు. వినాలని అంతకంటే లేదు. సుజాతకవుతే మధు కొత్త మనిషే. తన భర్తకు తనకు మధ్య యేవో పొరపులు వున్నాయని మూడోవాడు తెలుసుకోవటం సుజాతకు సుతరాం యిష్టంలేదు. మధుకు చెడ్డకోపం వచ్చేది. ప్రేమించి పెళ్లిచేసుకున్న తర్వాతకూడా భార్యకు భర్తకు భేదాభిప్రాయాలు గాని, తగాదాలు గాని వస్తాయా అని అనుకుని ఆశ్చర్యపోయేవాడు. అలాంటప్పుడు ప్రేమించుకోవటం యెందుకో? మధుకు సమాధానం రాని ప్రశ్న.

కొంతమంది వ్యక్తులు ప్రేమించుకుంటారు. దానికితగ్గ విషయాలు ఆ వ్యక్తుల్లోనే వుండిపోతాయి. ఆ కారణాలు వాళ్లకు తప్ప యింకోళ్లకు కనిపించవు. మూడో వ్యక్తి యెవరైనా, ఆ అమ్మాయి నేనా నువ్వు ప్రేమించిందన్నా, ఆ అబ్బాయి నేనా నువ్వు ప్రేమించిందన్నా చాలా కటువుగా వుంటుంది. ఆ వ్యక్తిని చీల్చి చెండాడాలనిపిస్తుంది. వాడికి ప్రేమంటే యేమిటో తెలీదు. ప్రేమంటే డబ్బు, చదువు, అందమేనా, అంటూ చెడ్డచిరాకు పడిపోతారు. ఒకళ్లనొకళ్లు యెందుకు ప్రేమించుకుంటున్నారో వాళ్లకేనా తెలుసా అని అవతలవాళ్లు అయోమయంలో పడిపోవటంకూడా కద్దు. ఏమైనా రవి సుజాతను ప్రేమించినట్లే సుజాత రవిని ప్రేమించింది. ప్రేమిస్తోంది. అది ప్రేమవివాహం. దీంట్లో రెండు అభిప్రాయాలు లేవు. పెళ్లికి ముందు తనను ఆకర్షించిన గుణాలు సుజాతలో తర్వాత యేమి తగ్గినాయో రవికి తెలియాలి కాని యింకోళ్ళకు అర్థంకావు. సుజాతలో అవుతే మార్పేమీ లేదు. పెళ్లికి ముందు పెళ్ళయిన తర్వాత తాను యెట్లా వుందామనుకుందో అట్లాగే వుంటోంది. రవిలో మార్పు రావటానికి గల కారణాలు సుజాతకూ వివరంగా తెలియలేదు. సమయం చూసి ఒకటి రెండు సార్లు రవిని అడిగింది కూడా. రవి యేమీ సమాధానం యివ్వలేదు. ఏమైనా యింట్లో ఒక్కక్షణం కూడా రవికి సుజాతకు పడేదికాదు. రవికి పెళ్లికాకముందు వున్న సూత్రాలు ఏవి కూడా పెళ్లయినతర్వాత తనను బంధించలేకపోయినాయి. మధుకూడా యీ మార్పును గ్రహిస్తూనే వున్నాడు. పెళ్లయిన తర్వాత రవి గొప్పతనం యింకా యెక్కువయినట్లనిపించింది. వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తిత్వం తప్పక గుర్తించగలడు రవి. కాని అవి తనకుమాత్రమే పరిమితమై వుండాలనే అభిప్రాయం వెలిబుచ్చినట్లు కనిపిస్తోంది. జీవితసహచారిణిని ఆ అర్థానికి తగ్గట్లుగానన్నా చూడాలని సుజాత అభిప్రాయం. తాను బ్రహ్మాండమైన కోరికలు యేమీ కోరుకోనేలేదు. రవివంటి భర్తకు తన కోరికలు యేవిధంగా కనిపిస్తాయో సుజాతకు పూర్తిగా తెలుసు. అసలు అలాంటి కోరికలు ఆమెలో యెన్నడూ రానేలేదు. మగవాళ్ళమీద వున్న ఆమె అభిప్రాయం యెన్నడూ కూడా రవి యెదుట చెప్పనేలేదు. పైగా ఆ దృష్టితో రవిని యెన్నడూ చూడనేలేదు. తన ఆ అభిప్రాయం మార్చుకోవటానికి రవి సహాయపడతాడనికూడా ఆశించింది సుజాత. తాను జన్మంతా దాసీగా వుండటానికి యీ కొంపలోకి రాలేదు. తన స్వేచ్ఛకు రవి అడ్డం వస్తాడని అదివరకు యెప్పుడూకూడా సుజాత వూహించనేలేదు. తన సహనం అంతమయిన యెన్నోరోజులదాకా రవికి ఆ విషయము తెలియనేలేదు. తెలియకూడదనికూడా సుజాత తాపత్రయపడేది. భార్యకాగానే ఆడదానికి వ్యక్తిత్వంపోతుందంటే మధు సహించడు. సుజాతకు ముందుగా యీవిషయం తెలుస్తే ఆమె నిర్ణయం యింకోవిధంగా వుండేదే. రవి ప్రపంచంలో ఒక నిరాశావాదిగాను, భ్రష్టుడుగాను, పిచ్చివాడుగాను తయారయిపోయేవాడు. రవిని బ్రతికించింది సుజాత పెళ్లిచేసుకుని. ఆ విశ్వాసమన్నా రవికి లేదు. రవి కోరుకున్నది హాయి, శాంతి, సుఖం. తాను సుజాతను పెళ్ళిచేసుకున్నది వీటికోసమే. తాను యీనాడు యిల్లువిడిచి వెళ్ళిపోయింది వీటికోసమే!

'అనుభవించేవాళ్లకు తెలుస్తుంది. నేను యీ యింట్లో ఒక్కక్షణం వుండలేను. నేను యీ గడప దాటిననాడే నాకు పరిపూర్ణమైన శాంతి, సౌఖ్యమూనూ'. రవి అన్న మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. రవి యేంచేస్తున్నాడో, యెక్కడెక్కడ తిరుగుతున్నాడో, యేవిధంగా వుంటున్నాడో మధు వూహించుకుంటున్నాడు. చిరాకు, కోపం రవిమీద యెక్కువయిపోతున్నాయి. ఇంకా రవి విషయం ఆలోచించటం నిరర్థకమనిపించింది. వృథా అయిన జీవితాన్ని గడుపుతూ యే సిద్ధాంతానికి యే సూత్రానికి కూడా కట్టుబడక నిరామయంగా జీవితం

వెళ్లిబుచ్చుతూ భాగ్యతల్ని అతి తేలికగా విస్మరించే వాళ్ళమీద తనకు యేవిధమైన సానుభూతీ వుండకూడదనుకున్నాడు. అందులో అతి ముఖ్యమైన స్నేహితుడే అలా అయిపోయాడంటే మరింత బాధగా వుంది మధుకు.

* * * *

రైలుకంటే తీవ్రంగా పోతోంది రవి ఆలోచన. ఎక్కడికి పోయినా యేమీ తెలియటంలేదు. ఇన్నాళ్లుగా వూళ్లు తిరుగుతున్నా తాను కోరుకున్నది యెక్కడా కనిపించటంలేదు మూడేళ్లు ఒక జీవితంలో క్షణకాలం అనుకున్నాడు. గమ్యస్థానం చేరుకోబోతున్న రైలులో ధ్యేయం లేని రవికి యెక్కడ దిగాలో అంతుపట్టటంలేదు. టెలిగ్రాఫ్ స్తంభాల్ని దాటేస్తున్నట్లె స్టేషన్లనుకూడా దాటేస్తోంది రైలు. రవి మనసులో అనేకం మెసులుతున్నాయి. సుజాత కనిపిస్తోంది.

'సుజాతా మనది ఒక ఆదర్శవివాహంగా వుండిపోవాలి. మన వివాహవిషయంలో నాకు సంబంధించినంతవరకు యెన్నో అడ్డంకులు వస్తున్నాయని నేను గ్రహిస్తూనే వున్నా. కాలక్రమేణా అన్నీ వాటంతట అవే సర్దుకుపోయినాయి. నీ విషయంలో కూడా అంతే అనుకుంటాను...'

'మీ నిబ్బరమే నిజాన్ని తెలుసుకోగలిగింది. ఏమాత్రం తొందరపాటైనా మీరు నన్ను అపార్థం చేసుకోక తప్పేదికాదు. దానివల్ల మనకు లాభంకంటే నష్టమే యెక్కువ జరిగేదే...'

రవి కనుబొమ్మలు చాలాదగ్గరకు వచ్చేసినాయి. కిటికీలోంచి వక్కసారిగా బైటకు చూశాడు. రయ్‌మంటూ గాలి మొహాన కొట్టేసింది.

పెళ్లి మేళాలు రవి చెవుల్లో గింగురుమన్నాయి. ఆనాడు కాలేజీ వాతావరణం అంతా తనయింట్లోకే వచ్చేసింది. శుభాకాంక్షలు, ఆశీస్సులు, టెలిగ్రాములు, వుత్తరాలు, పొగడ్తలు. సుజాతను పెళ్ళి చేసుకున్నావు. ఆమాటలో యెంత తృప్తి, యెంత ఆనందం. తనకళ్లకు కట్టినట్లుంది ఆ దృశ్యమంతా.

రవికళ్ళల్లో నీళ్లు క్షణంలో ఆ దృశ్యాన్నంతా కడిగేసినాయి.

స్టేషనులోనుంచి బైటపడ్డాడు రవి. నాలుగువేపుల తేరిపారచూశాడు. ఎక్కడాకూడా తాను అనుకున్నట్లే యెరుగున్నవాళ్లెవరూ కనిపించలేదు. ఇంతపట్నంలో యెక్కడోక్కడ యెవరో వకరు తగలకపోతారా అనే భయంమాత్రం రవిని పీడిస్తూనే వుంది. సరిగ్గా టాక్సీ ఆ పెద్దభవనంముందు ఆగింది. మెట్లు యెక్కుతూనే రవి వులిక్కిపడ్డాడు. ఎదురుగా కొంచెం దూరంగా ఒక ఆడమనిషి వస్తోంది. రవికి వణుకు యెక్కువయింది. తలెత్తి గట్టిగా ఆమె వంక చూడటానికి ధైర్యం చాలలేదు. వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనే ప్రయత్నంకూడా ఆ క్షణంలో సాగలేదు. ఆ అమ్మాయి దగ్గరకొస్తున్నకొద్దీ రవి గుండె బరువు యెక్కిపోతోంది. తనకళ్లు గుర్తుపట్టే దగ్గరలోకి ఆమె వచ్చేటప్పటికి ధైర్యంగా మెట్లు యెక్కేసి లోపల గదిలోకి వెళ్లిపోయాడు. ఆ గదంతా పరిశుభ్రంగా వుంది. గోడకు రంగురంగు ఫొటోలు యేవో వ్రేలాడుతున్నాయి. ఒక ఫొటోవంక చూసేటప్పటికి సుజాత జ్ఞాపకం వచ్చింది. అట్టే ఆ ఫొటోవంక చూస్తూ నిలబడిపోయాడు.

'మీరు మన పెళ్లి అయినతర్వాత చాలావరకు మారిపోయారు. నేనుమాత్రం మీకు తగ్గట్టుగానే మారిపోదామని అనుకోవటం లేదు. ఎప్పటికేనా మీరు మళ్ళీ మొదట వున్నట్లుగానే వుండిపోతారనే విశ్వాసం నాకున్నది....' సుజాత అన్నది.

'అవును నేను మారిపోయినట్లు కనిపించటంలో ఆశ్చర్యం యేమీ లేదు. వివాహం అయిన తర్వాత ఆడది యెట్లా వుండాలో నువ్వు గ్రహించుకున్నట్లయితే నేను మారిపోయినానని నువ్వు అనుకోవు. నీకా గ్రహింపు లేకపోవటం కూడా నేను మారిపోయినట్లె కనిపిస్తే నేనేం చేస్తాను...' రవి అన్నాడు.

'వాదనకు దిగితే నేను చెప్పలేనుగాని మీరు అదివరకున్నట్లుమాత్రం లేరు. అంతవరకు చెప్పగలను. నావల్ల యేదైనా లోపం వుంటే చెప్పండి. సర్దుకుంటాను. అట్లాగే...' సుజాత ఆపేసింది.

'తప్పులు యెంచటం తప్పులు దిద్దటం కాదు నా పని. ఎవరివి వాళ్లే తెలుసుకుని దిద్దుకుంటే, ఇంకోడు చెప్పే అవసరం వుండదు' రవి ఆపేశాడు.

రవి చెడ్డచిరాకుగా లోపలకు వెళ్లి స్నానంచేసి హాయిగా మంచంమీద పడుకుందామనుకున్నాడు. కాని రవికి శాంతి లేదు. ఎంతసేపు ప్రయత్నించినా రవి తన గడిచిన రోజుల్లోకే పోతున్నాడు. ఎంతసేపు

తన మనస్సును మథనచేసి ఆలోచించినా యింటికి వెళ్దామనే ఉద్దేశం రావటం లేదు. కొంచెం సేపు తన ఆలోచనలు సరిగా కూడా పోతున్నాయి. కాని సంఘం, సమాజం మాటలు చాలా భయంకరంగా కనిపిస్తున్నాయి. తాను అనుకున్న సిద్ధాంతాలకు యిప్పుడు జరుగుతున్న పనులకు యెక్కడా పోలిక లేదు. తాను అనుకున్న పనులన్నింటిలోను సుజాత సహాయంగా వుంటుందని ఆశించాడు. కాని సుజాత కంటకంగా తయారయింది. విచారం, ఆవేశం, కోపం, అన్నీ ఒకదానికంటె వకటి ముందుగా రవిని పిలుస్తూనే వున్నాయి. ఆగ్రహం యెక్కువయిపోతోంది. ఏవేవో తనకు జ్ఞాపకం వస్తూనే వున్నాయి. వాటిని భరించలేక పోతున్నాడు. సమన్వయం అంతకంటె చేసుకోలేక పోతున్నాడు. తాను కోరేది ప్రశాంతవాతావరణం. అది యింట్లో కనిపించక బైటకు వచ్చేశాడు. నీడలాగ తనను అశాంతి వెంటాడుతూనే వుంది. ఎక్కడకు పోయినా తాను తప్పించుకోలేని ఒక బాధమాత్రం వెన్నంటే వుంది. అది పోవటానికి చేసే ప్రయత్నాలు యేవీకూడా రవికి తృప్తిగా ఫలితాన్ని యివ్వలేక పోతున్నాయి.

మంచంమీదనుంచి లేచాడు చివాలున. గది తాళంపెట్టేసి బజార్లోకి వెళ్లాడు. అది సాయం సమయం. ఆ చల్లటి గాలులు శరీరాన్ని గిలిగింతలు పెట్టేస్తాయి. ఎర్రటి గులాబి రేకులు, ఎర్రటి సూర్య కాంతి, ఎదురుగా వున్న ఫౌంటెన్ నీళ్లలో ప్రతిబింబిస్తున్నాయి. ఆ నీళ్ళల్లో ఆ కాంతులన్నీ చిమ్ముకు పోతున్నాయి. పసిపిల్లలు పచ్చికబయళ్లమీద మొగ్గలు వేసుకుంటూ ఆడుకుంటున్నారు. ఎత్తుగా నిలబడ్డ సరివిచెట్ల వరసల్లోంచి రివ్వుమంటూ గాలి వచ్చేస్తోంది. ఆ ఫౌంటెన్ తుంపరులు రవిమీద అప్పుడప్పుడు పడుతూ హృదయాన్ని కలత పెట్టేస్తున్నాయి. ఇద్దరు వచ్చి రవిప్రక్కనే కూర్చున్నారు. ఇంకో జట్టు యింకొంచెం యెడంగా వచ్చి కూర్చుంది. ఆ ప్రశాంత వాతావరణం, ఆ కమ్మటి గాలులు, చాలామందిని ఆకర్షిస్తున్నాయి. ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ పకపకలు వెకవకలు కానిస్తున్నారు. తమ జీవితాన్ని సాంతం మరిచిపోయి ఆ క్షణంలో. అందరూ స్వర్గసౌఖ్యాల్ని అనుభవిస్తున్నట్లు అనుభూతి పొందుతున్నారు. రవి ఒక్కొక్కటే చూస్తూ ఆ పార్కంతా తిరిగేస్తున్నాడు. తాను యెటు పోతున్నాడో యేమి ఆలోచిస్తున్నాడో తనకేమీ తెలియటంలేదు. ఒక్క క్షణంకూడా ఆపచ్చిక మీద కూర్చోలేకపోయాడు. ఆ వాతావరణం చాలా వికృతంగా కనిపించింది రవికి. తన మనస్సు దేనిమీద కూడా లగ్నం కావటంలేదు. బైటకు వచ్చేశాడు తన రూములోకి వెళ్లిపోయి గడియ వేసుకుని దుప్పటికప్పుకుని. నిద్రపోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. నిద్రపట్టటంలేదు యేదో హఠాత్తుగా జ్ఞాపకం రావటం మళ్లీ నిద్రాభంగం అవటం యిల్లా రెండు మూడు సార్లయింది ఆ కటిక చీకట్లో రిస్టువాచిలో నాలుగు అంకెలు మాత్రం కనిపించినాయి అటు యిటు త్రిప్పి తికమకపడి లైటు వేసి టైము చూశాడు. చిన్నముల్లు నాలుగుమీదకు వచ్చేస్తోంది. లైటు ఆర్పేసి మరింత గట్టిగా ముసుగు పెట్టుకున్నాడు. బైట ప్రపంచానికి దూరమైపోతున్నాడు. కలతనిద్ర పడుతోంది. ప్రక్కలో మసులుతూనే వున్నాడు

'......పెద్ద బంగళా. చుట్టూ మనిషికంటె ఎత్తైన ప్రహరీగోడ. దొడ్డినిండా మొక్కలు. వాకిట్లో చెట్లు, తీగెలు, క్రోటన్లు. వెన్నెలరాత్రి. మల్లెపందిరకు గజం యెడంలో రెండు మడతమంచాల మీద రవి మధు పడుకుని వున్నారు ... ఏవేవో మాట్లాడుకుంటున్నారు. లోపల్నుంచి యేదో చప్పుడు వినిపించింది. మధు మనస్సు ఒక్కసారిగా మలినమై పోయింది. మధు తీవ్రంగా కనిపించాడు ఏదో ఆలోచిస్తున్నట్లుకూడా వున్నాడు. చిర్రు బుస్సులాడుతున్నాడు...

...మల్లెమొగ్గల్ని జుట్టులో ముడుచుకుని తెల్లటిచీరె నల్లటిజాకెట్టుతో వసంత మెల్లిమెల్లిగా నడుస్తూ వస్తోంది లోపల్నుంచి. రవి కళ్లార్పకుండా చూస్తున్నాడు. మధు నిప్పులు కక్కుతున్నాడు. రవికి ఆశ్చర్యంగా వుంది. వసంత దగ్గరకు వచ్చి మరచెంబుతో నీళ్లుపెట్టి లోపలకు వెళ్ళిపోయింది. రవి కళ్లార్పలేదు. మధు తలకాయ త్రిప్పలేదు. రవి చివాలున ఎడమవైపుకు తిరిగాడు. మళ్లీ సంభాషణల్లోకి దిగాడు. రవి హృదయం యెంతో ప్రశాంతంగాను, చల్లగానూ వుంది. గుండెమీద చెయ్యి పెట్టుకుని ఎడమవైపుకు తిరిగి పడుకున్నాడు. మధు కస్సుమంటూ వుండటం. రవి జాలిపడుతూ వుండటం.

...హఠాత్తుగా రవి మధుయింటికి వెళ్లాడు. వసంత వక్కర్తే యింట్లో వుంది. రవి హృదయం సంతోషించింది. శరీరం వణికింది. లోపలకు వెళ్లాడు. 'లేరంటూ' వసంత సమాధానం యిచ్చింది. రవి అప్పటికే ప్రశ్నలు వేస్తున్నాడు మెల్లిమెల్లిగా. వసంత పరిచయస్తునితో చెప్పతగ్గ సమాధానాలే చెపుతోంది. మధు, వసంతల మధ్య భేదాభిప్రాయాలు రవికి యేవిధంగానూ అంతుపట్టటం లేదు

ప్రక్కలో మెసులుతున్నాడు రవి మళ్లీ. మొహంలో చిరునవ్వు స్పష్టంగా కనిపిస్తోంది. అటు యిటు పత్తిగిలి మళ్లీ దుప్పటి పూర్తిగా కప్పేసుకున్నాడు

'.........నాకు యింత ఆస్తి వుంది యిన్ని సౌఖ్యాలు అనుభవించినా గాని, యీనాడు నేను యిక్కడ దాసిగా వుండటానికి నాకేమాత్రం యిష్టం లేదు. నేను నేనే ప్రతి చిన్నవిషయానికి మీ వప్పుదల కావాలంటే మాత్రం సాధ్యపడదు...' వసంత గొంతులో యేమాత్రం పిరికితనం కనిపించలేదు.

'నీ యిష్టను వచ్చినట్లు యిక్కడ వుండటానికి వీల్లేదు. పెళ్ళయిన తర్వాతకూడా యిట్లా ప్రవర్తిస్తే లోకులు చూసి యేమనుకుంటారో యేమన్నా తెలుసా. మధ్య నేను సిగ్గుతో ఛయపడి చావాలిసి వస్తుంది...' మధు ప్రాధేయపడుతున్న వాక్యాలు.

'దేనికైనా హద్దు అంటూ వుండాలి. నే నేమి తప్పు చేశానని ప్రతిదానికి మీరు అడ్డు రావటానికి. ప్రొద్దస్తమానం ఆ పరితతో తిరుగుతూ వుంటే నే నేమన్నా పట్టించుకున్నానా? మీమాదిరి మనస్సే నాదీ అవుతే యీపాటికి యెంతైనా అయ్యేదే. నా బాధ్యతలు నాకూ తెలుసు. మీరు నలుగుర్లో నన్ను అవమానించినట్లే మిమ్మల్ని యేదైనా యెవరైనా అంటే మీ కెట్లా వుంటుందో ఆలోచించుకున్నారా?...' వసంత తీవ్రంగానే అనేస్తోంది.

'వసంతా ... రాగారాగా నీకు నలుగురిలో నన్ను అవమానం చేద్దామనికూడా వుందా? ...' మధు సమాధానం.

'మీరు యేదైనా అనుకోండి. నా స్వేచ్ఛను, నా గౌరవాన్ని నా పరువును మీరు గౌరవించలేరు. ఎంతసేపటికి మీ గౌరవం, మీపరువు, మీమాటే. అంత నీచంగా భార్యను చూడ్దామనుకోవటం...' వసంత ఆపేసింది.

సంభాషణలు తీవ్రం అవుతూనే వున్నాయి. రవి మొహంలో ఒకవిధమైన ఆవేదన కనిపిస్తోంది. మెసలకుండా అట్లాగే పడుకుని వున్నాడు.

'మధూ...' అంటూ గభాలున లేచాడు రవి పక్కమీదనుంచి. ఎదురుగుండా కిటికీచువ్వల్లోంచి వస్తున్న సూర్యకిరణాలు రవి కళ్ళల్లో పొడిచినాయి. కళ్లు గభాలున మూసేసుకున్నాడు. ప్రక్కకు తిరిగి కళ్లు నలుపుకుంటూ ప్రక్కమీదనుంచి లేచి నిలబడ్డాడు. తానున్నగది జ్ఞాపకం వచ్చింది.

ఈ కలకు అంతరార్థం యేమిటి? మధుకు పెళ్లయిపోయిందన్నమాట. మధు భార్యతో అవినయంగా ప్రవర్తిస్తున్నాడా. మధు అలాంటివాడు కాదే. ఎన్నో ప్రశ్నలు రవిని బాధించటం మొదలుపెట్టినాయి. రవికి యెంతసేపు ఆలోచించినా యేమీ అంతు పట్టటం లేదు. ఆ కలే యెప్పటికప్పుడు జ్ఞాపకం వస్తోంది. ఇక ఆవూళ్లో ఒక్క క్షణంకూడా వుండలేకపోయాడు రవి. వెంటనే బెడ్డింగు సర్దుకుని రైలుస్టేషనువైపుకు ప్రయాణమయి పోయినాడు.

స్టేషన్లో దిగేసి మెల్లీగా కాళ్లీడ్చుకుంటూ బైటకు వచ్చేశాడు రవి. అటు యిటు చూసి నిరామయంగా నుంచొనిపోయాడు. అందరూ యెవరి దారిన వాళ్లు వెళ్లిపోతున్నారు. కొద్దిక్షణాల్లోనే ఆ జనసమ్మర్దం అంతా సర్దుకుపోయింది. చివరకు తానొక్కడే నిలబడి వున్నట్లు గ్రహించి గభాలున వులిక్కిపడి చకచక ఒక బండీలో బెడ్డింగు పడేశాడు. తాను యీవిధంగా యెన్నాళ్లు గడపగలుగుతాడు? ఎక్కడికని వెళతాడు? చివరకు యేం చేద్దామనుకుంటున్నాడు? యీ ప్రశ్నలన్ని ఇప్పుడిప్పుడే రవికే యేదోగా అనిపిస్తున్నాయి. తనను వెక్కిరిస్తున్నాయేమో అని కొంచెం భయంగా కూడా వుంది. బండివాడు యెక్కడ ఆపమంటారు. అంటున్నాడు. రవికి మెలకువ వచ్చింది. బండీ దిగేసి, బెడ్డింగుతో ఒక హోటలులోకి వెళ్ళబోతున్నాడు. హోటలున్నుంచి వస్తున్న శేఖర్ ను చూసి రవి ఆశ్చర్యపోయాడు. శేఖర్ యెంతో సంతోషంతో 'రవీ యెప్పుడు రావటం? యెక్కడనుంచి వస్తున్నావు. ఎక్కడుంటున్నావు. ఒక్క వుత్తరం

ముక్కున్నా వ్రాశావు కాదు!' ఆప్యాయంగా వూపిరి ఆడకుండా అడిగేస్తున్నాడు శేఖర్.

రవి నిబ్బరంగా సమాధానం కనక యివ్వకపోతే శేఖర్ అనుమానపడతాడని రవికి బాగా తెలుసు. ప్రశ్నలకు సమాధానాలు కొంచెంసేపు ఆలోచించినా శేఖర్‌కు తృప్తిగానే వున్నాయి.

ఈ వూరు చూద్దామని వచ్చాను అని అన్న మాట మాత్రం శేఖర్‌కు అంత తృప్తియివ్వలేకపోయిందే అని రవి కొంచెంగా బాధపడ్డాడు. కాని తప్పనిసరి అయిపోయింది. సరాసరి శేఖర్ యింట్లోకి వెళ్ళారు.

వల్లి కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు తెచ్చి, తలుపుచాటున పెట్టి, పమిట బుజానికి పూర్తిగా కప్పుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. శేఖర్ నీళ్ల చెంబు రవికి అందిచ్చాడు. ఆ చల్లటి నీళ్లతో కాళ్లు మొహం కడుక్కునేటప్పటికి అదో విధమైన హాయి నిచ్చింది రవికి. డ్రాయింగు రూములో వేసిన కుర్చీలలో శేఖర్, రవి కూర్చున్నారు రవి అట్టే శేఖర్ మొహంలోకి చూస్తున్నాడు.

'ఏమిటి అట్లా తీక్షణంగా చూస్తున్నావు నా వంక...'

'మనం కలుసుకుని యేన్నాళ్లయింది. అనుకోకుండా యీనాడు యిట్లా కలుసుకోవటం తలుచుకుంటే చాలా ఆశ్చర్యంగా వుంది! అన్నాడు రవి ముక్తసరిగా.

శేఖర్ నవ్వి వూరుకున్నాడు.

లోపలికి తేరిపార చూసి ఇప్పుడే వస్తున్నా అంటూ శేఖర్ యింట్లోకి వెళ్ళి రెండు కప్పుల కాఫీ తీసుకువచ్చి, రవి చేతికి ఒకటి అందిచ్చాడు.

రవి యేమి అడగబోతాడో అని గాబోలు, శేఖరే కల్పించుకుని పంచదార కావాలా అంటూ అలికదనుకున్న ప్రశ్న వేశాడు.

తలతోనే సమాధానం చెప్పేసి, రవి కప్పును ఖాళీ చేశాడు.

మధ్యాహ్నం తీరికగా కుర్చీలో కూర్చుని వున్నారన్న మాటేకాని రవికి మాత్రం తీరని బాధగానే వుంది. వల్లి పల్లెత్తుమాటకూడా మాట్లాడకపోవటం అంతకంటె ఆశ్చర్యంగా వుంది రవికి. సుజాత క్షణంలోకి జ్ఞాపకం వచ్చింది. సుజాతకు వల్లికి చెప్పలేనంత తేడా కనిపిస్తోంది. శేఖర్ కనుసంజ్ఞలో వల్లి పనులన్నీ పూర్తిచేస్తోంది. అంత దాసీగా, శేఖర్ వల్లిని చూడటం ఆ క్షణంలోనే రవికి చాలా వికృతంగా కనిపించింది. ఏదో తనకు బాగా అంటుపట్టని ఆవేశం రవికి ఎక్కువయిపోయింది. శేఖర్‌తో యేదో విషయంలో యీ ప్రస్తావన తీసుకువద్దామనుకున్నాడు. కాని శేఖర్ మాత్రం ఆ ప్రస్తావన వచ్చే వేళకు యేదో విషయాన్నిగురించి మాట్లాడటం ప్రారంభిస్తున్నాడు.

ఆ సాయంత్రం సినిమాకు వెళ్లేటప్పుడుకూడా వల్లి విషయము శేఖర్ యెత్తనేలేదు. రవి మనస్సుకు బాధగా వుంది. పాపం ఒకర్తే యింట్లో కూర్చుని వుంటుంది, మేము యెప్పుడువస్తామో అని యెదురు చూస్తూ. తనమూలానే వల్లి బాధపడుతోందేమో అనే సంకోచంకూడా రవికి వుంది. కాని తానేమీ చెయ్యలేకపోతున్నాడు. ఒక్క నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు. బైటకు వెళ్లేటప్పుడు మాత్రం టూకీగా శేఖర్‌ను అడిగాడు.

'రాదులే యింట్లో యేవో పనులుంటాయి' అన్నాడు అతి తేలికగా శేఖర్.

రవికి ఆ జవాబు నచ్చలేదు. ఇంకా అడుగుదామనుకున్నాడు. కాని అవకాశం చిక్కనేలేదు. సినిమాలో కూర్చున్నంతసేపుకూడా రవికి వల్లివిషయమే జ్ఞాపకం వస్తోంది. వల్లినిగూర్చే ఆలోచిస్తున్నాడు. శేఖర్ అప్పుడప్పుడుమాత్రం సినిమాను గురించి యేదో చెపుతూనేవున్నాడు. సరాసరి యింటికి వచ్చేశారు. వల్లి దీపంయెదుట మూసుకుపోతున్న కళ్లను బలవంతంగా నిలుపుకుంటూ చూస్తూ కూర్చుంది. అడుగులచప్పుడు వినపడగానే చివాలున లేచి నుంచుంది. రవి నిలువునా నీరయిపోయాడు.

శేఖర్ సినిమానుగురించి తాపీగా మాట్లాడే ధోరణిలోకి పోతున్నాడు. రవి వినీ వినకండా 'ఊ' కొడుతున్నాడు. స్నేహితుని యింటికి వచ్చి తానే భోజనానికి లెమ్మనటం బాగుండదేమోనని వుక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు. తలుపుసందులోంచి వల్లి కునికిపాట్లుపడటం రవికి బాగా కనిపిస్తోంది. నిజాన్ని చెప్పి శేఖర్‌ను లెమ్మనమనే

సాహసం రవిలో లేదు. చెప్పబోయే అబద్ధం శేఖర్ నమ్ముతాడని రవికి విశ్వాసం లేదు. మధ్యరకంగా రిస్టువాచీ చూసుకున్నాడు రవి.

'ఎవరైనా స్నేహితునితో సినిమాకు వెళితే పన్నెండేవరంటే లేవను...' అంటూ యేదో ఘనతగా చెప్పుతున్న శేఖర్‌ను చూసేటప్పటికి రవి మనోబాధ హెచ్చిపోయింది.

నాకు నిద్రవస్తోంది అనటంకంటె యింక యెక్కువ అనలేకపోయాడు రవి. ఆమాటవల్ల శేఖర్ అప్పటికేనా లేవకలిగాడు.

భళ్ళున తెల్లవారేలోగా రవి యెన్నో విషయాలు యెన్నో రకాలుగా ఆలోచించుకున్నాడు. కలలో కనపడ్డ వసంతమీద, యిక్కడి వల్లిమీద తనకు యెంతో జాలి సానుభూతి వున్నట్లు రవి అనుభూతి పొందుతున్నాడు. వాళ్ళిద్దరిమధ్య సుజాతకూడా జ్ఞాపకం వస్తూనేవుంది. సుజాతమాట అనుకుంటున్నప్పుడు రవికి అదివరకు వున్నంత తీవ్రమైన భేదాభిప్రాయం యేమీ కనిపించటం లేదు. పైపెచ్చు సుజాతననుసరించే యెక్కువగా ఆలోచించటం మొదలుపెట్టాడు. కాని యేనిశ్చితమైన సమాధానానికి ఒక్కపట్టున రాలేకపోతున్నాడు రవి.

'కాఫీ తొందరగా కావాలని చెప్పలేదూ...' శేఖర్ గట్టి గొంతుక దగ్గరవున్న రవినే వులిక్కిపడేట్లు చేసింది.

'తెస్తున్నా' అన్న సన్నటి గొంతుక లోపలనుంచి వచ్చింది.'

'శేఖర్ నువ్వు చదువుకునే రోజుల్లోకంటె యిప్పుడు చాలా మారిపోయినావు...' రవి మెల్లిగా అన్నాడు.

'వయస్సు వస్తున్నకొద్దీ మనిషి మారిపోడేమిటి? ఇంత చిన్నవిషయానికి యింత గొప్పగా ఆశ్చర్యాన్ని వెళ్ళబుచ్చావు...' శేఖర్ నవ్వుతూ అన్నాడు.

'అదికాదులే నీ ప్రవర్తన యింట్లో అదో తమాషాగా వుంది. అందుకని అన్నాను. నువ్వు యీ విధంగా వుంటున్నావంటే నేను నమ్మలేకుండా వున్నాను...' రవి శేఖర్ కళ్ళల్లోకి చూశాడు.

'ఇంకో గ్లాసు కావాలా...' శేఖర్ మాటను తప్పించటానికి ప్రయత్నంచేశాడు.

'నేను అడుగుతాలే కావాలసివస్తే... నాకు మాత్రం నీ ప్రవర్తన చాలా బాధగానే వుంది. అంత హీనంగా భార్యను చూడటమనేది వుందే అది మన సంస్కృతికి, మన విజ్ఞానానికే దెబ్బ. అంతకంటె యేం లేదు. ఎవరిమీదనో అధికారము చెలాయిస్తున్నానని అనుకోవటం మన తెలివితక్కువ. మన అజ్ఞానాన్ని బైట పెడుతున్నామన్న మాట ...నా కడుపులో దహించుకుపోతున్న మాటల్ని ఆంతరంగిక స్నేహితుడవు కాబట్టి నీతో చెపుతున్నాను. నువ్వు వేరేవిధంగా యేమీ అనుకోక...' రవి చాలా నిదానంగానే చెప్పాడు శేఖర్‌తో.

శేఖర్ కొద్దిసేపటిదాకా మాట్లాడలేదు.

రవి మళ్ళీ ఆ విషయాన్నే తీసుకువచ్చాడు.

శేఖర్ యీసారికూడా యేమి మాట్లాడలేదు.

రవి మళ్ళీ ఆ విషయాన్ని తీసుకురాదలచుకోలేదు.

ఆ రాత్రంతా శేఖర్ చెవుల్లో 'మన సంస్కృతికి, మన విజ్ఞానానికే దెబ్బ' అన్న రవిమాటలు మార్మ్రోగుతూనే వున్నాయి. శేఖర్ మెదడును ఆ మాటలు బాగా తొలిచేస్తున్నాయి. నిద్రపట్టటం లేదు. ఈ మాటల్లో యెంతో అర్థంవుందని యెంతో సత్యంవుందని నమ్మటానికి ప్రయత్నంచేస్తున్నాడు. ఇలాంటి అభిప్రాయం అదివరకు తనకు తట్టనూలేదు. ఇంకా యెవ్వరూకూడా చెప్పనూలేదు. రవిమీద యెంతో గౌరవం యేర్పడిపోతోంది. వల్లి తన ముందు నిలబడి తనను ఒక మనిషిగానే చూడమని జాలిగా ప్రాధేయపడుతున్నట్లనిపించింది శేఖర్‌కు. తనకళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినాయి తాను చదువుకున్నవి తాను తెలుసుకున్నవి యెన్నో విషయాలు శేఖర్‌కు గుర్తుకు వస్తున్నాయి. శేఖర్ ప్రక్కమీద ఆ రాత్రంతా మెసులుతూనే వున్నాడు.

రవికికూడా నిద్రపట్టటంలేదు. కలలోవచ్చిన వసంత శేఖర్‌భార్య వల్లి యీ యిద్దరికంటె సుజాత అతి సన్నిహితంగా తనను పలకరిస్తున్నట్లనిపిస్తోంది.

సుజాత అన్నమాటలు, ఆమె విజ్ఞానం, ఆమె ప్రవర్తన, యెంతో వున్నతంగా కనిపిస్తున్నాయి. తన

అజ్ఞానాన్ని అవి వెక్కిరిస్తున్నట్లు బాధపడుతున్నాడు. సుజాత మూర్తియింకు తాను చాలా తక్కువగా కనబడ్డట్లు వూహించుకుంటున్నాడు. రవి సిగ్గుపడిపోతున్నాడు. ఎప్పుడు సుజాతను చూద్దామా అనే ఆవేశంలో ఆరాత్రి రవి కంటిమీద కునుకు రాలేదు.

మర్నాడు ప్రొద్దున బండీకే రవి యింటికి బయలుదేరాడు. శేఖర్ వల్లి యిద్దరూ స్టేషనుకు వచ్చారు. వల్లిదగ్గరకూడా శలవు తీసుకుని శేఖర్ రైలులో పడ్డాడు.

రైలు దిగగానే మధు హడావిడిగా స్టేషనుపైపుకు వస్తున్నట్లు రవి చూశాడు. మధు వెనకాలే ఒక స్త్రీకూడా ఆదుర్దాగా వస్తోంది—మధు తనను చూడకుండా రవి జాగ్రత్త తీసుకున్నాడు. ఆ స్త్రీ యేదో ప్రాధేయపడుతోంది జాలిగా. మధు అతి కోపంగా ముందుకు వచ్చేస్తున్నాడు. ఆ స్త్రీ మెల్లిగా యేదో అన్నది మధుతో.

'అనుభవించేవాళ్లకు తెలుస్తుంది. నేను యీ యింట్లో వక్కక్షణం వుండలేను. నేను ఆ గడప దాటిననాడే నాకు శాంతీ సౌఖ్యమూనూ' మధు నిక్కచ్చిగా చెప్పినమాటలు రవి పూర్తిగా విన్నాడు.

రవిలో ఆవేశం పూర్తిగా ప్రవేశించింది. రవికి పూర్తిగా అర్థమయినట్లనిపించింది. గబగబ మధు దగ్గరకు రవి పరుగెత్తాడు. రవిని చూసి మధు ఏమో వెర్రిగా పరుగెత్తాడు. మధును చూడటంతోనే తన నిశ్చయం యింకా బలపడ్డట్లయింది.

'మధూ ..నువ్వెళ్లొద్దు. నేను చెపుతున్నాను. నామాట విను. నేను తెలుసుకొని వచ్చాను... నువ్వెళ్లొద్దు...' అంటూ గట్టిగా అరిచాడు రవి, రైలు పెట్టెదగ్గరకు పరుగెత్తుతూ.

రైలు పెట్టెలోంచి మధు అన్నమాటల్ని గార్డు విజిల్ యెవ్వర్నీ విననీయలేదు.